క్లుప్తంగా

ప్రహరీ నిర్మించండి

మల్దకల్: మండలంలోని బిజ్వారం హరిజన చెర్రి ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు గోకారన్న, తిరుమల్లేష్, సత్యం కోరారు. పాఠశాల ఎదుట ప్రధాన రహదారి ఉండడంతో విద్యార్థులు ప్రమాదాల బారిన పడే అవకాశముందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని కోరారు.

వజ్రోత్సవాల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్లు



అలంపూర్: హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో శుక్రవారం నిర్వహించిన స్వతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమంలో అలంపూర్, వడ్డేపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్స్ మనోరమ, కరుణశ్రీ పాల్గొన్నారు. కార్యక్రమానికి సీఎం కేసీఆర్ ముఖ్యఅతిథిగా హాజరైనట్లు వారు తెలిపారు.

ఆయిల్‌పాం సాగుపై అవగాహన



ధరూరు: నడిగడ్డ ప్రాంతంలో ఆయిల్‌పాం సాగు పెంపునకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మండల కేంద్రంలో రైతు మద్దిలేటి సాగు చేసిన ఆయిల్‌పాం పంట కోతకు వచ్చిన విషయం తెలిసిందే. అయితే రైతుల సందేహాలను నివృత్తి చేసేందుకు శుక్రవారం ధరూరు, గద్వాల మండలాలకు చెందిన 150మందిని రెండు ఆర్టీసీ బస్సుల్లో కర్నాటకలోని దేవదుర్గకు తీసుకెళ్లారు. అక్కడ ఆయిల్‌పాంను సాగుచేసిన రైతులతో స్వయంగా మాట్లాడించి సందేహాలను నివృత్తి చేశారు. ప్రభుత్వం మొక్కలతో మొదలుకొని డ్రిప్ తదితర వాటిపై ఇస్తున్న సబ్సిడీని వివరించారు. ఆయిల్‌పాం సాగుకు నడిగడ్డ భూములు అనుకూలంగా ఉన్నాయని, రైతులు ముందుకు రావాలని అధికారులు కోరారు.

తాగునీటి ఇబ్బందులు రానివ్వం



అమరచింత: పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజలకు నిరంతరం తాగునీటిని అందించడంలో మున్సిపల్ పాలక వర్గంతో పాటు మున్సిపల్ అధికారులు కృషి చేస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. పట్టణంలోని నాలుగు, ఆరో వార్డులో కొన్ని నెలలుగా తాగునీటి ఎద్దడి ఏర్పడటం, అక్కడి సోర్స్ బోర్లు మరమ్మతుకు గురికావడంతో నీటి సరఫరాలో ఇబ్బందులు కలిగాయన్నారు. ప్రస్తుతం వాటిని మరమ్మతు చేయించి ఆయా వార్డులకు తాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. పట్టణంలోని పది వార్డుల్లో మిషన్ భగీరథ ద్వారా ఏర్పాటు చేసిన ఓవర్ హెడ్ ట్యాంకుల నుంచి ప్రతి నిత్యం తాగునీటిని సరఫరా చేస్తున్నామని, కొన్ని ప్రాంతాల్లో పైప్‌లైన్‌ల మూలంగా నీటి సరఫరా ముందుకు వెళ్లడం లేదని విషయాన్ని సంబంధిత అధికారులకు విన్నవించామన్నారు. కార్యక్రమంలో నాగభూషణంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

అలంపూర్: ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలను అర్హులైన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని.. 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని.. వీటిపై తహసీల్దార్లు అవగాహన కల్పించాలని ఆర్డీఓ చంద్రకళ అన్నారు. శుక్రవారం అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓల సమావేశం నిర్వహించగా ఆర్డీఓ హాజరై మాట్లాడారు. 18 ఏళ్లు నిండి ప్రతి ఒక్కరిని బీఎల్ఓలు ఓటర్లుగా నమోదు చేయాలని, ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు ఉంటే సంబంధిత ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. స్వీకరించిన దరఖాస్తులు ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఈ నెల 19 తేది వరకు స్వీకరించిన అన్ని దరఖాస్తులు పూర్తి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు బీఎల్ఓలు పకడ్బందీగా విధులు నిర్వర్తించాలన్నారు. ఈ నెల 2, 3 తేదిల్లో ప్రత్యేక ఓటరు దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీఎల్ఓలు పోలింగ్ కేంద్రాల వద్ద ఉండాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు మంజుల, జ్యోతి, షాహిదా బేగం, మైనుద్దీన్, శ్రీనివాసజోషి, వెంకటేశ్వర్లు, డీటీ జయంతి, ఎంపీడీఓలు, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటికో ఇంకుడుగుంత

- భూగర్భజలాల పెంపునకు దోహదం
- శాస్త్రీయ పద్ధతిలో ఇంకుడుగుంతల పనులు
- ఒక్కో నిర్మాణానికి రూ.4,200 ప్రభుత్వ ప్రోత్సాహకం
- గ్రామాల్లో వందశాతం నిర్మాణాలే లక్ష్యంగా అధికారుల చర్యలు



కొదండాపురంలో ఇంకుడుగుంతల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)



గార్లపహాడ్‌లో ఇంకుడుగుంత నిర్మాణం

ఎర్రవల్లిచౌరస్తా: సకల ప్రాణకోటికి నీరే జీవనాధారం. నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. కొందరు అవగాహన లేమితో నీటిని వృథా చేస్తున్నారు. దీంతో భవిష్యత్ తరాలకు నీటిముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది. నీటి వృథాకు చెక్ పెట్టేందుకుగానూ ప్రభుత్వం జలశక్తి అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇంటింటా ఇంకుడుగుంతల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఒక్కో నిర్మాణానికి రూ.4,200 అందించి ప్రోత్సహిస్తోంది. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలను చైతన్యం చేస్తున్నారు. అన్ని గ్రామాల్లో వందశాతం నిర్మాణాలే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారు.

ప్రయోజనాలెన్నో..

ప్రతి ఇంటికీ ఇంకుడుగుంత ఏర్పాటు చేయడం వల్ల వృథా నీరంతా భూమిలోకి చేరి ఇంటి ఆవరణతోపాటు పరిసరాలలో భూగర్భజలాలు పెంపొందుతాయి. దీంతో బోరుబావులు, వాగులు, వంకలు నీటితో కళకళలాడుతాయి. భూగర్భజలాలు పెరిగితే ఏడాదిపాటు వర్షాలు కురవకపోయినా నీటి ఎద్దడి తలెత్తదని అధికారులు తెలుపుతున్నారు.

ప్రతి ఇంటికీ ఇంకుడుగుంత..

ఇటిక్యాల మండలంలోని 29 పంచాయతీల్లో ఇంటింటా ఇంకుడుగుంతల నిర్మాణాలను చేపట్టేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పలు గ్రామాల్లో వీటి నిర్మాణాలు చురుకుగా సాగుతున్నాయి. మండలానికి 4,224 ఇంకుడుగుంతలు మంజూరు కాగా.. ఇప్పటివరకు 2,353 నిర్మాణాలు పూర్తయ్యాయి. మరికొన్ని వివిధ దశల్లో పనులు సాగుతున్నాయి.

ఇలా నిర్మించాలి..

ఇంకుడు గుంతలను శాస్త్రీయ పద్ధతిలోనే నిర్మించాలి. వర్షపునీరు సైతం ఒకవైపునకు చేరేవిధంగా ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతను ఏర్పాటు చేయాలి. 4 అడుగుల వెడల్పు, 4 అడుగుల పొడవు, 6 అడుగుల లోతుగా గుంతను తీయాలి. 3 అడుగుల కింది భాగాన్ని పెద్దపెద్ద రాళ్లతో నింపాలి. ఒక సిమెంట్ గొళ్లెం తీసుకొని పైభాగంలో సరిపడా రంధ్రాలు చేసి గుంత మధ్యభాగంలో అమర్చాలి. ఇక గుంతలో మిగిలిన భాగాన్ని 3ఫీట్ల లోతును 45ఎంఎం కంకరతో మొత్తం నింపాలి. గుంత మొత్తం పూర్తయ్యాక వర్షపునీరు వృథాగా పోకుండా పైపు ద్వారా గోతిలోకి పోయేవిధంగా చూసుకోవాలి. తద్వారా ఇంకుడుగుంత ఎప్పటికప్పుడు వచ్చే వృథా నీటితో నిరంతరం చార్జ్ అవుతూ భూగర్భజలాలను పెంచేలా చూస్తుంది.

అవగాహన కల్పించాలి..



గ్రామాల్లో ఇంకుడుగుంతల ప్రాముఖ్యతపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. ముఖ్యంగా శాస్త్రీయ పద్ధతిలో ఇంకుడు గుంతలను ఎలా నిర్మించాలి, వాటి వల్ల భూగర్భజలాలు ఏ విధంగా పెరుగుతాయో క్షేత్రస్థాయిలో వివరించాలి. గ్రామాల్లో ఇంకుడు గుంతలపై ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి.

– కుర్వ బీసన్న, కారుపాకుల

లక్ష్యం చేరుకుంటాం..



ఇంటింటా ఇంకుడుగుంత నిర్మించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పంచాయతీ కార్యదర్శులు కూడా ఇంకుడుగుంతల నిర్మాణాల్లో ఎలాంటి శ్రద్ధ చూపుతున్నారో నిరంతరం సమీక్షిస్తూ.. పనులను పర్యవేక్షిస్తున్నాం. ఇంకుడు గుంతలను నిర్మించుకుంటేనే గ్రామాల్లో భూగర్భజలాలు పెరుగుతాయి. త్వరలోనే వందశాతం నిర్మాణాలను పూర్తి చేస్తాం.

– అనిల్‌కుమార్, ఏపీఓ, ఇటిక్యాల

ఓటరు నమోదును విజయవంతం చేయండి



అయిజలో మాట్లాడుతున్న కమిషనర్ నర్సయ్య



గట్టులో..

అయిజ: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య బీఎల్ఓలకు సూచించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మహిళా సంఘాల ఆర్పీలు, బీఎల్ఓలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. బూత్‌ల వారీగా అర్హులైన వారిని గుర్తించి ఓటరుగా నమోదు చేయాలన్నారు. పట్టణంలోని యువతీ యువకులు బీఎల్ఓలను సంప్రదించి వివరాలు తెలియజేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ రాజేష్‌కుమార్, వార్డు ఆఫీసర్లు ఉన్నారు.

శాంతినగర్: 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమోహన్ అన్నారు. ఓటుహక్కు ప్రాముఖ్యతపై కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శివనారాయణ, ఏడుకొండలు, వెంకటేష్, రాఘవేంద్ర, లక్ష్మీనారాయణ, బీసన్న, మహేష్, రాజేష్, జితేంద్రబాబు పాల్గొన్నారు.

గట్టు: ప్రజాస్వామ్య దేశంలో ఓటుహక్కు చాలా విలువైందని, ఓటు విలువ తెలుసుకుని మసలుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఓటుహక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని శ్రీరంగు వెంకటకృష్ణారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకుడు మహేంద్రనాథ్‌గౌడ్ మాట్లాడుతూ ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమవుతుందని, అర్హులందరూ తప్పనిసరిగా ఓటుహక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఓటు ప్రాధాన్యంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

అయిజ: మండలంలోని తుపత్రాల, తూంకుంట గ్రామాల్లో శుక్రవారం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి ఆధ్వర్యంలో 254 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత టీకాల కార్యక్రమం ముగిసిందని తెలిపారు. ఇంకా టీకాలు వేయించని పశువులు ఉంటే వెటర్నరీ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు.

పద్మశాలీల అభ్యున్నతికి కృషి

అమరచింత: పద్మశాలీల సంఘం పట్టణ నూతన అధ్యక్షుడిగా మహంకాళి విష్ణును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు దేవరకొండ లచ్చన్న తెలిపారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా భక్త మార్కండేయ ఆలయంలో శుక్రవారం పద్మశాలీ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పారుపల్లి సత్యం, ప్రధాన కార్యదర్శిగా మహంకాళి ప్రభాకర్, సహాయ కార్యదర్శిగా సిల్వూరి రాములు, పోతు శ్రీధర్, కోశాధికారిగా సంబారి మాదన్న, తిరుమల సత్యనారాయణతో పాటు పలువురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

అబ్రహంకు బీఫాం ఇస్తే పార్టీకే నష్టం



అయిజలో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే అబ్రహంకు బీఫాం ఇస్తే బీఆర్ఎస్ తీవ్రంగా నష్టపోతుందని ఎంపీపీ స్నేహ అన్నారు. శుక్రవారం ఎర్రవల్లి చౌరస్తాలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యే అబ్రహం కమీషన్ల కోసం ఒంటెద్దు పోకడ వల్ల ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను పట్టించుకోకుండా కేవలం లాభార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నారని మండిపడ్డారు. అబ్రహం అంటేనే పూర్తి అవినీతి అనేలా ఎదిగారన్నారు. సాటి దళితులకు వచ్చే పథకాలలో కూడా కమీషన్లు వదలడం లేదన్నారు. జెడ్పీటీసీ హన్మంతురెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రంగారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభ్యర్థిత్వంపై బీఆర్ఎస్ అధిష్టానం పునరాలోచన చేయాలని కోరారు. కొత్తవారికి అవకాశం కల్పించి పార్టీని కాపాడాలన్నారు. అంతకుముందు బీఆర్ఎస్ జెండాలతో ప్రజాప్రతినిధులు, నాయకులు ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాందేవ్‌రెడ్డి, జోగుళాంబ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, శేఖర్‌గౌడ్, రవిప్రకాష్, నర్సింహులు, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

అయిజ: ఎమ్మెల్యే అబ్రహం అభ్యర్థిత్వంపై పార్టీ అధిష్టానం పునరాలోచించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్యనాయకులు సమావేశమయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎక్లాస్‌పురం నర్సింహారెడ్డి, భూంపురం నర్సింహారెడ్డి, ప్రహ్లాదారెడ్డి, రఘునాథరెడ్డి, ఆర్.కిశోర్, సుందరరాజు, తిప్పన్న, రాములు మాట్లాడుతూ నియోజకవర్గంలో అబ్రహం అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో అబ్రహంకు తప్ప మరెవరికి టికెట్ ఇచ్చినా అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామన్నారు.

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు



కుర్తిరావుల చెర్వు-మల్దకల్ గ్రామాల మధ్య ఉన్న మలుపు



పెద్దొడ్డి రోడ్డు మలుపు ఇలా..

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులపై ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. రోడ్ల మలుపుల వద్ద అధికారులు ఎలాంటి సూచిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మల్దకల్-మద్దెలబండ, అమరవాయి-బిజ్వారం, పెద్దొడ్డి, కుర్తిరావులచెర్వు రోడ్లపై మలుపులు ప్రమాదకరంగా మారాయని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మలుపుల వద్ద వాహనాలను నియంత్రించలేక ప్రమాదాల బారిన పడుతున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై ఉన్న మలుపుల వద్ద సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందాం



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: పోరాడి సాధించుకున్న ఎర్రవల్లి మండలాన్ని కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందామని ఎంపీపీ స్నేహ అన్నారు. ప్రభుత్వం ఎర్రవల్లి మండలాన్ని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం ఎర్రవల్లి చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల సాధనకు ఎర్రవల్లితోపాటు సమీప గ్రామాల ప్రజలు పోరాడారని గుర్తు చేశారు. 15 గ్రామపంచాయతీలు ఏకగ్రీవ తీర్మానాలు చేశాయని.. అఖిలపక్షం, మండల సాధన సమితి ఆధ్వర్యంలో ఎర్రవల్లి కూడలి నుంచి జిల్లా కేంద్రానికి పాదయాత్ర చేపట్టి ఉన్నతాధికారులు, మంత్రులకు వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. ప్రజల ఆకాంక్షను గుర్తించిన ప్రభుత్వం ఎర్రవల్లిని మండలంగా ప్రకటిస్తూ తుది గెజిట్ విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. మండల సాధన కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఎంపీపీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జెడ్పీటీసీ హన్మంతురెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రంగారెడ్డి, రాందేవ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రవిప్రకాష్ పాల్గొన్నారు.

ఏఎన్ఎంలకు నోటీసులివ్వడం సిగ్గుచేటు



సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న రంగన్న

గద్వాల అర్బన్: తమను రెగ్యులరైజ్ చేయాలని సమ్మె చేపట్టిన సెకండ్ ఏఎన్ఎంలకు ప్రభుత్వం నోటీసులు ఇవ్వడం సిగ్గుచేటని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రంగన్న అన్నారు. జిల్లా కేంద్రంలో ఏఎన్ఎంలు చేపట్టిన సమ్మె శుక్రవారంతో 17వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్యరంగాన్ని మొదటిస్థానంలో నిలిచేందుకు ఏఎన్ఎంలు కీలకపాత్ర పోషించారన్నారు. ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నోటీసులు జారీ చేసి బెదిరింపులకు పాల్పడడం సరికాదన్నారు. ఇప్పటికైనా మొండివైఖరి వీడాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు మహేశ్వరి, సరస్వతి, సులోచన, భారతి, పార్వతి, కవిత పాల్గొన్నారు.

వీఓఏలకు సముచిత గౌరవం



అలంపూర్‌లో వీఓఏలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: వీఓఏల కష్టానికి అనుగుణంగా సీఎం కేసీఆర్ వేతనాలను పెంచి సముచిత గౌరవం కల్పించారని ఎమ్మెల్యే వీఎం అబ్రహం అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వీఓఏలతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఓఏలు ఎమ్మెల్యేను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్షాబంధన్ కానుకగా మహిళా సంఘాల సహాయకులకు రూ.8వేల వరకు వేతనం పెంచినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 17,608మందికి లబ్ధి చేకూరుతోందన్నారు. 2016 నుంచి వీఓఏలకు రూ.3వేల వేతనం ఇవ్వగా, ప్రభుత్వం పీఆర్సీని వీఓఏలకు వర్తింపజేయడంతో రూ.5,900లకు వేతనం పెరిగిందన్నారు. మరోసారి ప్రభుత్వం వేతనాలను పెంచి అండగా నిలిచినట్లు తెలిపారు. మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేయాలని వీఓఏలకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అలంపూర్ రూరల్: మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన మాసమ్మ (95) శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అబ్రహం మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. ముందుగా ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సేంద్రియ ఎరువుల వాడకంతో లాభం



నాగర్‌దొడ్డిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న నర్సింహులు

మల్దకల్: పంటల సాగులో సేంద్రియ ఎరువుల వాడకంతో రైతులకు లాభం చేకూరుతోందని రిసోర్స్‌పర్సన్ నర్సింహులు అన్నారు. మండలంలోని దాసర్‌పల్లి, మేకలసోంపల్లి, నాగర్‌దొడ్డి గ్రామాల్లో శుక్రవారం స్వీడ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు రవిప్రకాష్ ఆధ్వర్యంలో రైతులకు సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగించాలని సూచించారు. సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులను సాధించవచ్చన్నారు. రసాయనిక ఎరువుల వాడకంతో పంట పొలాల దెబ్బతిని పంటలు నష్టపోయే వీలుందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు భరత్‌కుమార్‌రెడ్డి, సత్యమ్మ, సువార్తమ్మ, స్వీడ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు మధులత పాల్గొన్నారు.

అంధత్వరహిత సమాజాన్ని నిర్మిద్దాం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రిజ్వానా తన్వీర్

మానవపాడు: అంధత్వరహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని డాక్టర్ రిజ్వానా తన్వీర్ కోరారు. అంధత్వ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం మండలంలోని పలు పాఠశాలల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ అంధత్వ నియంత్రణ, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఆగస్టు 25నుంచి నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేత్రదానంతో మరొకరికి కంటిచూపు ఇవ్వొచ్చని తెలిపారు. కార్యక్రమంలో సత్యనారాయణ, చంద్రన్న, వెంకటేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయకుంటే సమరమే..



గద్వాలలో నిరసన వ్యక్తం చేస్తున్న జాక్టో నాయకులు

గద్వాల: ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం చేకూర్చే సీపీఎస్ విధానాన్ని రద్దు చేయకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని జాక్టో నాయకులు హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా శుక్రవారం పెన్షన్ విద్రోహ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జాక్టో నాయకులు మాట్లాడుతూ సీపీఎస్ విధానంతో కనీస పెన్షన్ కూడా పొందే పరిస్థితి లేకుండాపోతోందన్నారు. సీపీఎస్ రద్దు కోసం సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాక్టో నాయకులు యూనుస్‌పాషా, లక్ష్మణ్, సత్యనారాయణగౌడ్, ప్రవీణ్, శ్రీధర్, టీసీ నర్సింహులు, రఘు, జగదీశ్వర్, ఎల్లప్ప పాల్గొన్నారు.

అలంపూర్: సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి, ఓపీఎస్‌ను అమలు చేయాలని ఉపాధ్యాయులు కోరారు. పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు శుక్రవారం పెన్షన్ విద్రోహక దినాన్ని పురస్కరించుకొని టీ విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీపీఎస్ రద్దును ప్రభుత్వం పట్టించుకోకపోతే భవిష్యత్‌లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ రాజు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి

ధరూరు: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీపీయూఎస్ నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ప్రవీణ్‌కుమార్, రాజేష్, ఆంజనేయులు, హరి, వంశీ, సురేష్ పాల్గొన్నారు.



అలంపూర్‌లో..



దరూరులో..